www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 జులై 2024
5
ఏలూరు



నీట్ పరీక్ష రద్దు కోరుతూ ఎంఎల్ఎకు వినతి

ఏలూరు అర్బన్: నీట్-2024 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యాన స్థానిక ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పరీక్షపై పలు సందేహాలు వ్యక్తం చేస్తూ ఒకవైపు తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నా, మరోవైపు విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నా బిజెపి ప్రభుత్వం ఏమాత్రం స్పందించడానికి ఇష్టపడటం లేదన్నారు. వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి, నిష్పక్షపాతంగా వ్యవహరించే స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ ఏర్పాటు చేసి విద్యార్థులకు భరోసా కల్పించాలన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం జరగకపోవడం బాధాకరమని, దీంతో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్.క్రాంతి, ఎన్.యశ్వంత్, సిహెచ్.చందాన్, విష్ణు పాల్గొన్నారు.



'కొలువు' కుస్తీ..!

- ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా బిఇడి, డిఎడ్ అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో వెయ్యి వరకూ పోస్టులు ఉన్నట్లు లెక్క
- కోచింగ్ కోసం అవనిగడ్డకు క్యూ
- ప్రస్తుత ఉద్యోగాలు వదిలి ప్రభుత్వ కొలువు కోసం పాట్లు
- పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఒకే రోజు పెట్టాలని అభ్యర్థుల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధ్యాయ కొలువు కోసం బిఇడి, డిఎడ్ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో ఉపాధ్యాయ కొలువు కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోయారు. నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం మెగా డిఎస్‌సి పేరుతో 16 వేలకుపైగా పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎన్నోఏళ్లుగా ఉపాధ్యాయ కొలువు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులంతా ఈసారి అవకాశాన్ని జారవిడుచుకోకూడదనే లక్ష్యంతో కష్టపడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల మందికిపైగా బిఇడి, డిఎడ్ చదివిన అభ్యర్థులు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం విడుదల చేయబోయే డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లాలో వెయ్యి వరకూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉందని లెక్కలు చెబుతున్నారు. దీంతో బిఇడి, డిఎడ్ చదువుకున్న అభ్యర్థులంతా ప్రభుత్వ కొలువు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు కోచింగ్ సెంటర్లకు అభ్యర్థులు క్యూ కడుతున్నారు. డిఎస్‌సి కోచింగ్‌కు అత్యంత ప్రసిద్ధి చెందిన కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు అంతా తరలివెళ్తున్నారు. మూడు నెలల కోచింగ్‌కు రూ.20 వేల వరకూ ఫీజు, హాస్టల్ ఖర్చులతో మొత్తం దాదాపు రూ.50 వేలు వరకూ ప్రతి నిరుద్యోగ అభ్యర్థి ఖర్చు పెడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలాఖరుకు ఉపాధ్యాయ కొలువుల భర్తీని పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సరిపడే సమయం ఉండటంతో కష్టపడితే కొలువు సాధించవచ్చుననే పట్టుదలతో అంతా నిమగ్నమయ్యారు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా కష్టపడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. అయితే కోచింగ్‌లకు వెళ్లేవారికి కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటి వరకూ జిల్లాలవారీగా పోస్టుల వివరాలను ప్రకటించలేదు. దీంతో ఒక్కో అభ్యర్థి రెండు, మూడు పోస్టులకు అర్హులుగా ఉన్నారు. పోస్టుల వివరాలు ప్రకటిస్తే అందుకు తగినట్లుగా కోచింగ్ చెప్పించుకోవచ్చునని అంతా మదనపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పోస్టుల వివరాలను ప్రకటించాలని పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులంతా కోరుతున్నారు. వయో పరిమితి దగ్గర పడుతున్న అభ్యర్థులు ఈసారి కొలువు సాధించేందుకు తహతహలాడుతున్నారు. అదే సమయంలో డిఎస్‌సికి సిద్ధమవుతున్నవారిలో సచివాలయ ఉద్యోగులు సైతం ఎక్కువగా ఉన్నారు. సచివాలయాల్లో గ్రేడ్-5, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులుగా పని చేస్తున్న వారంతా ఎక్కువ మంది బిఇడి చదివిన వారే ఉన్నారు. వీరంతా ఈసారి డిఎస్‌సిలో మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయ కొలువు సాధించాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

డిఎస్‌సి పరీక్ష ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్

డిఎస్‌సి పరీక్ష ఆఫ్‌లైన్‌లో ఒకేరోజు నిర్వహించాలని ఉపాధ్యాయ కొలువు కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులంతా కోరుతున్నారు. గతంలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష ఒకేరోజు కాకుండా నాలుగైదు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఒకరోజు పరీక్ష పేపర్ తేలికగా వస్తే, మరోరోజు కష్టంగా వస్తుందని, ఎంపిక మాత్రం ఒకేలా ఉంటుందని అభ్యర్థులు చెబుతున్నారు. పరీక్ష కష్టంగా వచ్చిన రోజు అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకే రోజు ఒకే పేపర్‌తో ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఇంకా ఏ విషయం తేల్చలేదు. ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం అంగీకారం తెలుపుతుందో లేదో వేచిచూడాలి.



ఇసుక నిల్వల్లో తేడాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

నేటి నుంచి నూతన ఇసుక విధానం

- చేబ్రోలులో ఇసుక డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్
- అసంపూర్ణ వివరాలు చెప్పిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- మైనింగ్ సర్వేయర్‌కు షోకాజ్ నోటీసుకు ఆదేశాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 8 నుంచి ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని అమలు చేయనుందని, ఏజెన్సీ ఖరారయ్యేంత వరకూ రెవెన్యూ అధికారులే దీనికి బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. చేబ్రోలులో ఇంతవరకూ నిర్వహిస్తున్న ఇసుక డంపింగ్ యార్డును ఆదివారం ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ, మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకూ ఇక్కడ డంపింగ్ యార్డు నిర్వహించిన కాంట్రాక్టు సంస్థ ఎంతకాలం నుంచి ఇసుక యార్డు నిర్వహిస్తోంది, ఎంత ఇసుక నిల్వ ఉంది, చివరిసారిగా ఇక్కడ ఎప్పుడు ఇసుక స్టాక్ దిగుమతి చేశారు అంటూ కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు మైనింగ్ ఎడిఎ సునీల్ సరైన జవాబు ఇవ్వలేదు. చేబ్రోలు ఇసుక స్టాకు పాయింట్‌లో 557 మెట్రిక్ టన్నులు ఇసుక ఉందని మైనింగ్ అధికారులు నివేదిక ఇవ్వగా క్షేత్రస్థాయిలో అంత స్టాకు లేకపోవడంపై కలెక్టర్, ఇతర అధికారులు నివ్వెరపోయారు. తాను తనిఖీకి వచ్చినప్పుడు మైనింగ్ శాఖ సర్వేయర్ అందుబాటులో లేకపోవడం, నివేదికకు, క్షేత్రస్థాయిలో స్టాకుకు పొంతన లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేయర్‌కు షోకాజ్ నోటీసు ఇస్తామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా, కచ్చితమైన వివరాల్లేకుండా తూతూమంత్రంగా నివేదికలిస్తారా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ చేబ్రోలు ఇసుక యార్డులో ఎన్నికల ముందు వరకూ ఇసుక గుట్టగుట్టలుగా కొండను తలపించేలా నిల్వ ఉండేదని, అదంతా ఏమైందో విచారణ చేయించాలని కలెక్టర్‌ను కోరారు. కుక్కునూరు రీచ్ నుంచి వచ్చే ఇసుక నాణ్యతగా ఉంటుందని, అందుకు దీనికి ఎక్కువ డిమాండ్ అని అన్నారు. ప్రస్తుతం ఇక్కడ కొంతమేర ఉన్న ఇసుక గుట్టలో మట్టి కలిసి ఉందని, ఇది ఇంటి నిర్మాణానికి పని చేయదని అధికారులు నిర్ధారించారు. కుక్కునూరు లేదా తూర్పుగోదావరి ఇసుక రీచ్‌ల నుంచి స్టాకు తెచ్చి సోమవారం నుంచి ఇసుక సరఫరా చేసేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీకి అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ఇసుక యార్డు చుట్టూ ఫెన్సింగ్ వేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ పర్యవేక్షణలో రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలోనే ఇసుక పంపిణీకి చర్యలు తీసుకోంటామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ వెంకటరమణ, తహశీల్దారు శివయ్య, డిటి బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఆర్ఐ సిరిగినీడి సత్యనారాయణ పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన ఇసుక విధానం సోమవారం నుండి అమల్లోకి రానుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. ఆదివారం కుక్కునూరు మండలం వింజరంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను సందర్శించి ఇసుక లభ్యతను పరిశీలించారు. సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అమలుకు అందుబాటులో నిల్వలను అంచనా వేసి రెవెన్యూ శాఖకు అప్పగించాలని సాంకేతిక సిబ్బందికి సూచించారు. ఈ ధరలు ఆయా స్టాక్ పాయింట్లవారీగా నిర్ణయించి ప్రదర్శిస్తారన్నారు. ఆధార్‌కు అనుసంధానంగా ఒకరోజుకి ఒకరికి 20 మెట్రిక్ టన్నుల ఇసుకను అందిస్తారన్నారు. ప్రతి మండలంలో ఇసుక స్టాక్ పాయింట్లను పరిశీలించేందుకు తహశీల్దార్లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని, వీరు వ్యక్తిగతంగా స్టాక్ పాయింట్లో ఉన్న ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించామన్నారు. కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపట్నం, వింజరం, దాచారంల్లో, వేలేరుపాడు మండలంలో రుద్రంకోట-1, 2ల్లో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్ అచ్యుత్‌కుమార్, స్థానిక మండల అధికారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

చిత్తశుద్ధితో చేయబట్టే ఉత్తమ ఫలితాలు - జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



వర్షాకాలం వస్తుందంటే పరిసరాలు తడిగా మారడంతో దోమలు, ఈగలు ఎక్కువగా ఉండి వ్యాధులు ప్రబలడానికి ఎక్కువ ఆస్కారం ఏర్పడుతుంది. ప్రతియేటా మలేరియా, డెంగీ, అతిసార, వైరల్ ఫీవర్స్ ప్రబలుతుంటాయి. మన్యం, వ్యవసాయం కలగలిసిన మన జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రతియేటా పునరావృతం కావడం సర్వసాధారణం. అయితే వీటిని వీలైనంత మేర నియంత్రించడం, వాటివల్ల సంభవించే మరణాలను తగ్గించడమే వైద్యఆరోగ్య శాఖ ముందున్న సవాలు. ముందస్తు ప్రణాళికతో ఈ ఏడాది సీజనల్ వ్యాధుల తీవ్రతను తగ్గించగలిగామని చెబుతున్నారు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ. గత జూన్‌లో కృష్ణా జిల్లా జగ్గయ్యపేట, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అతిసార ప్రబలిన నేపథ్యంలో జిల్లాలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో వైద్యారోగ్య శాఖ సేవలపై ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో డిఎంహెచ్ఒ పలు విషయాలు వివరించారు.

ప్రశ్న: జిల్లాలో అతిసార, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డిఎంహెచ్ఒ: అతిసార నివారణకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 జిల్లాలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం డయేరియా కారణంగా ఐదేళ్లలోపు పిల్లల మరణాలు లేకుండా చూడటం. జిల్లాలోని 1822 మంది ఆశా కార్యకర్తలు, 605 మంది ఎఎన్ఎంలు, 463 మంది ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 1,44,749 మంది ఐదేళ్లలోపు పిల్లలకు రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేస్తారు. ఆరేళ్లలోపు పిల్లలకు రోజుకు అర మాత్ర, ఆరు నెలలు దాటిన పిల్లలకు రోజుకు ఒక మాత్ర చొప్పున విరోచనాలతో బాధపడే పిల్లలకు 14 రోజులు వేసేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: డయేరియా నివారణకు ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి చర్యలు చేపట్టారు?

డిఎంహెచ్ఒ: ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు మన జిల్లాలో ఉన్న 62 పిహెచ్‌సిలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 3 ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి, 2225 అంగన్వాడీ కేంద్రాలు, ప్రయివేటు ఆసుపత్రులు మొత్తం 2955 చోట్ల ఉచితంగా ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: వివిధ శాఖలతో సమన్వయం ఎలా ఉంది?

డిఎంహెచ్ఒ: వర్షాకాలం ముందు నుంచే అనేక శాఖలను భాగస్వాములను చేసి పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ వారు పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిలో ఎవరైనా డయేరియాతో బాధ పడితే వైద్యఆరోగ్య శాఖ సిబ్బందికి తెలియజేయడం, పిల్లలకు, తల్లులకు చేతులు శుభ్రపరిచే పద్ధతులను నేర్పించడం జరుగుతుంది. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీలు, మున్సిపాల్టీల ఆధ్వర్యాన శానిటేషన్ కార్యక్రమాలతోపాటు తాగునీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించి మరమ్మతు చేయడం, తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామాల్లో డయేరియాతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వ్యాధి తీవ్రతను బట్టి పిహెచ్‌సి, సిహెచ్‌సిలకు, జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కోసం నా కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. ఈ కంట్రోల్ రూమ్ ఫోన్‌నెంబర్ 9912341488. జిల్లాలో ఏ విధమైన డయేరియా కేసులుగాని, అంటువ్యాధులుగాని ప్రబలినా ఆ సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చు.



ప్రశ్న: జిల్లాలో అనధికార వైద్య సేవలపై చర్యలేమైనా తీసుకున్నారా?

డిఎంహెచ్ఒ: అతిసార, ఇతర వ్యాధులు ఏమైనా వచ్చినప్పుడు ఆర్ఎంపిలు, పిఎంపిల వద్దకు వెళ్లొద్దు. కొందరు తెలియక పెద్దలకు పెట్టే సెలైన్స్ పిల్లలకు పెడుతున్నారు. మందులు చాలా పవర్ ఎక్కువ ఉన్నవి వాడుతున్నారు. ఇది ప్రమాదకరం. మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఇటీవల పెదవేగి, వేలేరుపాడుల్లో ఇలాంటి వైద్యం చేస్తున్న ఆర్ఎంపి, పిఎంపిలను పట్టుకున్నాం.

ప్రశ్న: జిల్లాలో వ్యాధుల తీవ్రత ఎలా ఉంది?

డిఎంహెచ్ఒ: మేము ముందస్తు చర్యలు చేపట్టడంతో గతేడాదితో పోల్చితే వ్యాధుల తీవ్రత, మరణాల నమోదు తక్కువగా ఉంది. మలేరియా గతేడాది 183గా ఉంటే, 2014 జనవరి నుంచి ఇప్పటి వరకు 34 కేసులు మాత్రమే నమోదయ్యాయి. డెంగీ కేసులు 2023లో 252 నమోదవ్వగా, 2024లో ఇప్పటి వరకు 69 మాత్రమే నమోదయ్యాయి. వైరల్ ఫీవర్స్ రోజుకు 50 చొప్పున నమోదవుతున్నా ఎక్కడా మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: జిల్లాలో ప్రసవ మరణాలు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎంహెచ్ఒ: జిల్లాలోని ఆసుపత్రుల్లో ప్రసవాలు నూరు శాతం జరుగుతున్నాయి. ప్రసవ మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లడంతో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. 2023 ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు 10,855 ప్రసవాలు జరగ్గా 11 మరణాలు చోటుచేసుకున్నాయి. నేను వచ్చాక 2023 సెప్టెంబర్ నుంచి 2024 మార్చి నాటికి 14776 ప్రసవాలు జరగ్గా కేవలం 11 మరణాలే సంభవించాయి. ఈ ఏడాది చివరి నాటికి 2192 ప్రసవాలు జరుగుతాయని అంచనా వేస్తున్నాం.

వరద ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల నిల్వలు

పరిశీలించిన జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్



నిల్వలను పరిశీలిస్తున్న జెసి లావణ్యవేణి

వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. ఆదివారం కుక్కునూరు గిరిజన కోఆపరేటివ్ గోడౌన్‌లో పిడిఎస్ స్టాక్‌ను తనిఖీ చేసి ఎఫ్‌పి షాపుల వద్ద పిడిఎస్ రైస్ పొజిషనింగ్‌ను పునరుద్ధరించుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కుక్కునూరు మండలం కివ్వాకలోని ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాంతంలో ముందస్తుగానే నిల్వ ఉంచిన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ కుక్కునూరు మండలం కివ్వాక, తొండిపాక, అమరవరం, ఉప్పేరు, కొండపల్లి, గొమ్మిగూడెం, మెరుడుబాక, దామరచర్ల, చీరవల్లి, దాచారం, ఇసుకపాడు, నెమలిపేట తదితర గ్రామాలు, వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, మామిడిగొంది, కట్కూరు, భూదేవిపేట, కాకిసునూర్ తదితర ప్రాంతాల్లో చాలావరకు నిత్యవసర వస్తువులను మండల్ లెవెల్ స్టాక్ పాయింట్, కుక్కునూరు నుండి తరలించామని చెప్పారు. జెసి వెంట జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్ అచ్యుత్ కుమార్, సిఎస్‌డిటి, సిబ్బంది ఉన్నారు.

మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ 10న డిమాండ్స్ డే

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రయివేటీకరణ విధానాలు నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 10న సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేపట్టిన పోరాటాల ఫలితంగా మోడీ ప్రభుత్వానికి సీట్లు తగ్గాయన్నారు. ఇప్పటికైనా లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కీలకమైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, బ్యాంక్ వంటి రంగాలను ప్రయివేట్ పరం చేసే ఆలోచనలను, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ, ఆశ, వెలుగు, ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర రంగాల కార్మికులందరినీ ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, వారందరికీ కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి పథకాలు అమలు చేయాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో డిమాండ్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు జి.రాజు, ఎం.నాగమణి, బి.సోమయ్య, వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, ఎస్‌కె.సుభాషిణి, ఆర్‌విఎస్.నారాయణ, నారపల్లి రమణరావు, ఎస్.రాంబాబు, ఎం.దుర్గారావు, వై.సాయికిరణ్ తదితరులు మాట్లాడారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగకరం

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



కప్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ చంటి, ప్రముఖులు

మానసిక ఒత్తిడిని జయించడంతోపాటు ఆపత్కాలంలో ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఎపి కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14, 15 తేదీల్లో బడేటి ఛాలెంజ్ కప్ పేరుతో ఏలూరులో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి అందించనున్న విజేత కప్‌ను ఎంఎల్ఎ బడేటి చంటి ఆదివారం స్థానిక రామకృష్ణాపురంలోని కాస్మోపాలిటిన్ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కరాటేలో నైపుణ్యం పొందాలన్నారు. విద్యార్థులను కరాటేలో ప్రోత్సహిస్తూ ఎంతోమందిని కరాటే యోధులుగా తయారు చేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్న ఇబ్రహీం బేగ్, షహన్షాలను ఆయన అభినందించారు. బడేటి పేరుతో నిర్వహిస్తున్న ఈ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఏలూరు విద్యార్థులు కప్‌ను సొంతం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఇండియా చీఫ్ కోచ్ ఇబ్రహీంబేగ్ మాట్లాడుతూ 15వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఏలూరులోని సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. జాతీయ, అంతర్జాతీయ, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో తాము శిక్షణ ఇచ్చిన విద్యార్థులు ఎన్నో బంగారు పతకాలు సొంతం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షహన్షా, నల్లబాబు, నాగం శివ, కౌలూరి చంద్రశేఖర్, ఈతకోట శ్రీనివాసరావు, బెల్లపుకొండ కిషోర్. అమరావతి అశోక్, నారాయణ, కరాటే మాస్టర్ రాధ, పలువురు ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

వృద్ధులు హక్కులు వినియోగించుకునేలా చర్యలు

జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్రాపు శివరామకృష్ణారావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు తమ హక్కులు వినియోగించుకునేలా తగిన చర్యలు అసోసియేషన్ ద్వారా తీసుకుంటామని జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్రాపు శివరామకృష్ణారావు తెలిపారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివరామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులకు అవసరమైన పరికరాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. వృద్ధులకు ఏమైనా సమస్యలుంటే అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాగిరాజు జానకిరామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వృద్ధులకు ప్రభుత్వపరంగా వచ్చే రాయితీలు సక్రమంగా అందుకునేందుకు తమ హక్కులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి నారాయణరావు, ఉపాధ్యక్షులు పి.రాధాకృష్ణ, డాక్టర్ ఎన్‌విఎస్.ప్రసాద్, అసోసియేషన్ సెక్రటరీ బి.భాస్కరరావు, టి.రామకృష్ణ, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరామకృష్ణారావు



ఎంఎల్ఏకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నేతలు, అంగన్వాడీలు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఏ చిర్రి బాలరాజుకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోలవరం ఎంఎల్ఏ చిర్రి బాలరాజుకు సిఐటియు నేతలు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మెడియం నాగమణి, అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.పుష్ప మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీలు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారన్నారు. పని భారం పెరిగిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, 42 రోజుల సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీలో ఉన్న అన్ని అంశాలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెల్లం రామలక్ష్మి, కృపామణి, ఎస్తేరు, నాగమణి, మంగతాయారు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గిరిజన నేత మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



కన్నప్పరాజు (ఫైల్‌ఫోటో)

అనారోగ్యంతో గిరిజన మండల నాయకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అంకన్నగూడెం పంచాయతీ జగన్నాధపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సోడెం కన్నప్పరాజు(40) గత మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురవ్వడంతో చింతూరు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తీసుకెళ్తూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమారుడు ఉన్నారు. కన్నప్పరాజు గిరిజన మండల సంఘంలో ముఖ్య పాత్ర పోషించారని, కొన్నేళ్లుగా జగన్నాధపురం మామిడి తోట ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారని జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు తెలిపారు. అతని మృతి గిరిజన సంఘానికి తీరని లోటన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు గిరిజన సంఘం తరుపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంఎల్ఏ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఏ చిర్రి బాలరాజు అన్నారు. ఎంఎల్ఏ చిర్రి బాలరాజును ఆయన నివాసంలో జీలుగుమిల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలకు ఉపయోగపడే వార్తలు రాయాలని సూచించారు. మండలంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఏ బాలరాజును, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు జి.రవికుమార్‌ను మీడియా ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ పాత్రికేయులు రెడ్డి, రామకృష్ణ, మూర్తిరాజు, కృష్ణమోహన్, పోసిరావు, ప్రసాద్, సతీష్, సత్తిబాబు పాల్గొన్నారు.

అధ్యాపకుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కామవరపుకోట

ఏలూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులను 2024-25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏప్రిల్ 30 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పెద్దింట్లమ్మ సన్నిధిలో ఎంఎల్ఏలు

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో ఉన్న పెద్దింట్లమ్మను ఉంగుటూరు ఎంఎల్ఏ పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో యాత్రికులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి తగిన ఏర్పాట్లు చేశారు. ఎంఎల్ఏలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కెవి.గోపాలరావు అతిథి మర్యాదలతో ఆహ్వానం పలికారు. శేషవస్త్రం, పూలదండలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి జగన్నాథస్వామి వారి రథయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. రథయాత్రను టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. స్వామివారి రథయాత్ర ఆలయం నుంచి ప్రారంభమై వడాలి గ్రామ పురవీధుల గుండా ముదినేపల్లి ప్రధాన సెంటర్ వరకు, అక్కడ నుంచి పెదగొన్నూరు సింగరాయపాలెం శ్రీ బాలాజీ మఠం వరకు వెళ్ళి, అక్కడ నుంచి తిరిగి వడాలి శ్రీ స్వామివారి సన్నిధికి చేరుకుంది. ఈ సందర్భంగా మేళ తాళాలతో, చిత్ర విచిత్ర వేషధారులతో, కోలాట ప్రదర్శనలు, వేదమంత్రాల మధ్య రథయాత్ర ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగేందుకు గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేరాలు - ఘోరాలు

దాడి ఘటనలో మహిళపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళను కొట్టి గాయపరిచిన మరొక మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లంపట్ల పంచాయతీ పరిధిలో ఉన్న శింగరాయపాలెంలో ముళ్లగిరి భవాని, జక్కం రాధలకు సంబంధించి ఇళ్ల మధ్య వర్షం నీటి ప్రవాహానికి సంబంధించి ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ జరిగింది. భవాని గడ్డపారతో రాధను కొట్టడంతో ఆమె గాయాలపాలైంది. బాధితురాలిని కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో భవానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ సమీర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

ఇచ్చట స్థలాలు అమ్మబడును..!

ఆక్రమణలో ప్రభుత్వ స్థలాలు, డ్రెయిన్లు
పట్టించుకోని అధికారులు
ఇది ముదినేపల్లి సెంటర్ దుస్థితి



ఆక్రమణలో ముదినేపల్లి సెంటర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్నో ఏళ్లుగా ముదినేపల్లి పంచాయతీ పరిధిలో పక్కా డ్రెయిన్లు, వివిధ శాఖల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. గ్రామపంచాయతీ డ్రెయిన్లపై కొందరు స్వార్థపరులు, బడాబాబులు, బడా వ్యాపారులు, ఇష్టారాజ్యంగా, విచ్చలవిడిగా పక్కా నిర్మాణాలు చేపట్టి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణాన్ని రూ.ఏడు వేల నుంచి రూ.పది వేల వరకు అద్దెకు ఇస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నారు. ఈ రీతిన ముదినేపల్లిలోని గుడివాడ రోడ్డు, బంటుమిల్లి రోడ్డు, సంత మార్కెట్, గుడివాడ రోడ్డు, కైకలూరు రోడ్డు, ప్రధాన సెంటర్‌లోని రోడ్ల వెంబడి ఉన్న డ్రెయిన్లు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతూ కొందరు అద్దెలకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఆక్రమించిన స్థలం వారి పట్టా భూమి అయినట్లుగా దర్జాగా ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుని జేబుల్లో నింపుకుని జల్సాగా విలాసవంతమైన జీవితం జీవిస్తున్నారు. ఈ విధంగా ముదినేపల్లి పంచాయతీ పరిధిలోని డ్రెయిన్లు, ఆర్అండ్‌బి స్థలాలను వారి సొంత అవసరాలకు, వ్యాపారాలకు వినియోగించుకోవడమే కాకుండా అద్దెలకిస్తూ, ఇతరులకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి చాలా కాలంగా ముదినేపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతోంది. సంత మార్కెట్‌లో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చిరు వ్యాపారులకు రోజువారి, నెలవారి అద్దెలకిస్తూ కష్టపడకుండా దర్జాగా బతికేస్తున్నారు. ఈ రీతిన ముదినేపల్లి ప్రధాన సెంటర్ అక్రమార్కులకు అడ్డాగా మారింది. ఈ ఆక్రమార్కులకు, బడాబాబులకు రాజకీయ నాయకులు, అధికారుల అండదండలు కూడా పుష్కలంగా ఉండడంతో వారి ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతుంది. ఈ తంతు ఎంతో కాలంగా జరుగుతున్నా పట్టించుకున్న వారే లేకుండాపోయారు. ఈ ఆక్రమణల కారణంగా గురజ రోడ్డు సెంటర్, బంటుమిల్లి రోడ్డు, సంత మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. తరచూ ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో ప్రజలు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమణ చేసి పక్కా నిర్మాణాలు చేపట్టడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పలు సార్లు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై పదుల సంఖ్యలో మృత్యువాత పడగా, చాలామంది క్షతగాత్రులుగా మారిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ముదినేపల్లి సెంటర్ గుండా నిత్యం వేలాది వాహనాలు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ముదినేపల్లి సెంటర్ ముఖ్య కూడలి కావడంతో ఈ సెంటర్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ముదినేపల్లి సెంటర్‌లోని డ్రెయిన్లను, వివిధ ప్రభుత్వ శాఖల స్థలాలను కబ్జా చేస్తూ పక్కా నిర్మాణాలు చేపట్టిన బడా బాబులు, బడా వ్యాపారులు, అక్రమార్కుల ఆధీనంలో ఉన్న ఆక్రమణలను, పక్కా కట్టడాలను తొలగించి ఇటు గ్రామ డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి, అటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆక్రమణలను త్వరితగతిన తొలగించాలని ముదినేపల్లి గ్రామస్తులు సంబంధిత శాఖల అధికారులను, గ్రామపంచాయతీని ముక్తకంఠంతో కోరుతున్నారు.

చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

సిఐటియు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి జిఒ ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, హెల్త్ అలవెన్సులు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఏలూరు జిల్లా కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న సిఐటియు జిల్లా కార్యాలయంలో బి.బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం వివరాలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు వెల్లడించారు. చింతలపూడి గ్రామపంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారి నాలుగేళ్ల గడుస్తున్నప్పటికీ మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చలేదని, కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని సమావేశం తెలిపింది. చింతలపూడి మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయని పక్షంలో ఆందోళన చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత డిసెంబర్ నెలలో జరిగిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. డిసెంబర్ నెలలో రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకుందని, దానికి అనుగుణంగా ఇంకా అనేక అంశాలకు జిఒలు విడుదల చేయలేదన్నారు. సర్వీసులో ఉండగా చనిపోయిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియో రూ.రెండు లక్షలు అన్నిచోట్ల ఇప్పించాలని, చనిపోయిన వారి దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేల జిఒ విడుదల చేయాలని కోరారు. ఈ నెల పదో తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఇచ్చిన జాతీయ కోర్కెల దినం ఆందోళనలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వినుకొండ రమేష్, లావేటి కృష్ణారావు, ఆర్.నాగరాజు, లక్ష్మణ్, రాజు, మంగ, పద్మ, శివాజీ, సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

10న ఆలయ భూముల వేలం

ప్రజాశక్తి - ముసునూరు

బలివే ఆలయ భూములను వ్యవసాయ సాగు చేసుకునేందుకు ఈ నెల పదో తేదీన కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు బలివే ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం తాలూకా భూమి ఆర్ఎస్ నెంబర్ 186లో య. ఏడు ఎకరాల భూమిని మూడేళ్ళ సాగు చేసుకునేందుకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. బలివే, వేల్పుచర్ల, రంగంపేట, వెంకటాపురం గ్రామాల రైతులు పాల్గొనాలని తెలిపారు. ఈ వేలం పాట ఆలయ కార్య నిర్వహణాధికారి, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట కొత్తపేట బిసి కాలనీ రామాలయం సమీపంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు తపన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం శిక్షకురాలు బి.లక్ష్మి ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం అందరికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ అవకాశాన్ని కామవరపుకోట పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

కమ్యూనిటీ హాలు విస్తరణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎన్నికల ప్రచార సమయంలో రజకుల కమ్యూనిటీ హాలు విస్తరణ పనులు చేపడతామని ఇచ్చిన హామీ మేరకు మంత్రి కొలుసు పార్థసారధి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని ఆగిరిపల్లి మాజీ సర్పంచి, రజక సంఘ నాయకులు సగ్గుర్తి రమేష్ అన్నారు. ఆగిరిపల్లి రజక వీధిలో రజకుల కమ్యూనిటీ హాలు విస్తరణ పనులకు శ్రీ కనకదుర్గమ్మ తల్లి ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు నెరుసు సతీష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.నరసింహారావు, ఎం.బుజ్జి, ఎస్‌కె.ఖాదర్‌బాషా, ఎం.శ్రావణ్, ఎం.గోపాల్, జనసేన నాయకులు ఎం.మహేష్ పాల్గొన్నారు.

పలుచోట్ల ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - చాట్రాయి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి ఈ నెల ఏడో తేదీకి 30 ఏళ్లు అయిన సందర్భంగా మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షుడు మొలుగుమాటి రవిరామ్ జెండా ఆవిష్కరించారు. చిత్తపూరు గ్రామంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ పెద్దలు సర్వయ్య, క్రాంతికుమార్, వెంకటేశ్వరరావు, జై రాజు, మోషే, పుల్లారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పిఎస్)ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జెండాను ఎంఆర్‌పిఎస్ నాయకులు కంభాల ప్రదీప్ మాదిగ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎస్.కాంచనరావు మాదిగ, టి,ఆదాం, ఎం.రవిశేఖర్, బి.సురేష్, కె.వంశీ వశిష్ట, బి.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి హరిప్రసాద్‌కు జనసేన నేతల సత్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జనసేన పార్టీ తరపున ఎంఎల్‌సిగా ఎన్నికైన పిడుగు హరిప్రసాద్‌ను మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. హరిప్రసాద్‌ను కలిసినవారిలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, జనసేన నూజివీడు మండలాధ్యక్షుడు యర్రంశెట్టి రాము, నాయకులు ముమ్మలనేని సునీల్‌కుమార్

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ముసునూరులో మాంసం విక్రయాలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముసునూరు గ్రామంలో ఇటీవల డెంగీ కేసు నమోదైంది. డెంగీ నివారణలో భాగంగా ముసునూరు గ్రామంలో నెల రోజులపాటు మాంసం విక్రయాలు చేయకూడదని ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఆంక్షలు విధించారు. అయినా ముసునూరులో మాంసం విక్రయదారులు అధికారుల ఆదేశాలు బేఖాదర్ చేసి ఆదివారం యధావిధిగా మాంసం విక్రయాలు నిర్వహించారు. స్థానిక రజకపేటలో చేపలు, మాంసం విక్రయాలు, పలుచోట్ల చికెన్ వ్యాపారులు చాటుగా మాటుగా మాంసం విక్రయాలు చేశారు. డెంగీ నివారణకు పంచాయతీ పాలకవర్గం, అధికారులు కృషి చేస్తుంటే మాంసం విక్రయదారులు అధికారుల ఆదేశాలు బేఖాదర్ చేయటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మాంసం విక్రయదారులు లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముసునూరు గ్రామస్తులు కోరుతున్నారు.



ముసునూరులో విక్రయిస్తున్న మటన్

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్టేట్ టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా నాగలక్ష్మి, సెక్రటరీగా సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా గోపీ, శ్రీనివాస్‌రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఎఎస్ఎన్.మల్లేశ్వరరావు, కోశాధికారిగా, ఇ.అనుపమ, అదనపు సెక్రటరీగా వి.శ్రీపద్మజ, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఎన్నికైన సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల టైపిస్టుల బదిలీలు సక్రమంగా జరగలేదన్నారు. కొందరు టైపిస్టులకు ప్రమోషన్లు రావడం మూలంగా అనివార్య కారణాలవల్ల బదిలీలు నిలిపివేసిన సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లా నూతన కార్యవర్గం సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు.

సంప్రదాయ సాగు కొనసాగేలా సహకరించాలి

గన్ని వీరాంజనేయులును కోరిన ఆగడాలలంక వాసులు

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు అభయారణ్య పరిధిలో సాంప్రదాయ సాగు కొనసాగేందుకు సహకరించాలని ఆగడాలలంక గ్రామస్తులు, పెద్దలు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులకు విజ్ఞప్తి చేశారు. ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు విజయానికి కృషి చేసిన గన్ని వీరాంజనేయులుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను భీమడోలులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతవాసులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు సహకరించాలని కోరారు. గ్రామ పరిధిలో అసంపూర్తిగా ఉన్న మహిళా సమాఖ్య భవనాలు, బిసి సామాజిక భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. ఆగడాలలంక ఛానల్ రోడ్డు పున:నిర్మించాలన్నారు. దీనిపై స్పందించిన గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఆగడాలలంక ఛానల్ రోడ్డు పున:నిర్మాణానికి మంజూరైన రూ.పది కోట్ల నిధులు దారి మళ్లాయన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంజూరైన రూ.10 కోట్ల నిధులు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఓటమితో విడుదల కాలేదన్నారు. కొల్లేరు ప్రాంతవాసుల ఆర్థిక పరిపుష్టికి తగు కార్యక్రమాలను అమలు చేయాల్సి ఉందన్నారు. వీటన్నింటిపై ఉంగుటూరు శాసనసభ్యులు ధర్మరాజుతో పాటు, ఏలూరు ఎంపీ మహేష్‌తో చర్చిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సిరిబత్తిన కొండబాబు, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీటితో అవస్థలు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - నిడమర్రు

మండల కేంద్రమైన నిడమర్రు గ్రామం నుంచి గణపవరం, నారాయణపురం వైపు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేశారు. కొన్ని చోట్ల రోడ్డు మళ్లీ మరమ్మతులకు గురవ్వడంతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. నిడమర్రు గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు గ్రామం నుంచి వచ్చే రహదారికి చాలా ఎత్తులో ఉంది. దీంతో వర్షపు నీరు చేరి ఆ ప్రాంతం చెరువును తలపిస్తుంది. ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు సమ్యను పరిష్కరించారి కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ముదినేపల్లి : పెయ్యేరు గ్రామంలో ఆదివారం వంద మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ ప్రముఖులు దుక్కిపాటి రాజేంద్ర ప్రసాద్ సతీమణి దేవికరాణి జ్ఞాపకార్థం వంద మంది వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. పలువురి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌గా చెక్కును అందించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ మాజీ సర్పంచి దుక్కిపాటి శేషుబాబు, హనుమర పేర్నీడు, వైసిపి నేత జాస్తిబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

లారీ యజమానులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

లారీ యాజమాన్యాల పరిస్థితి బాగోలేదని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని చింతలపూడి లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి నాగేశ్వరరావు అన్నారు. చింతలపూడి నియోజకవర్గ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఆచంట వెంకటరమణ, సెక్రటరీ వంగల నాగ ప్రసాద్ రెడ్డి, ట్రెజరర్ ఉయ్యూరి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులుగా మూర్తి, చౌదరి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ లారీలకు కిరాయి లేక, నెలవారీ కిస్తీలు కట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదగొన్నూరు గ్రామపంచాయతీ పరిధిలోని రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గ్రామం గుండా భారీ వాహనాలు, టిప్పర్లు, రాకపోకలు సాగించడంతో గ్రామంలోని రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతల కారణంగా వర్షపు నీరు గుంతల్లో చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ సర్పంచి తాడంకి శిరీష రాజేష్, పంచాయతీ కార్యదర్శి జె.గిరిజ, వార్డు సభ్యుల సమక్షంలో జెసిబి తీసుకొచ్చి గుంతల్లో కంకర, మెటీరియల్ వేసి మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో రోడ్లపై ఏర్పడ్డ గుంతలు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కారకులను శిక్షించాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమిళనాడు బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసినవారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి నగరంలోని నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు, అఖిల భారత తపాల ఎస్‌సి ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు దాసరి నాగేంద్రకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కరి అంబేద్కర్, కొత్తల పూర్ణ, మల్లికార్జున్, ఖండవల్లి స్వామిదాసు, వెంకటరమణ పాల్గొన్నారు.

24 నుంచి ఎఐటియుసి రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణా తరగతులు

ఏలూరు టౌన్ :ఈ నెల 24, 25, 26 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరగనున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూనపాముల విఘ్నేష్, భజంత్రి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షులు విఘ్నేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు మదనపల్లిలోని హార్స్ లీహిల్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, సంయుక్త కార్యదర్శి జోగి ప్రభాకరరావు, కార్యవర్గ సభ్యులు యలగాడ శివకుమార్ పాల్గొన్నారు.